సాక్షి నల్లగొండ

మంగళవారం । 22 । జూలై । 2025





**గరుడ టికెట్‌తో శీఘ్ర దర్శనం**

యాదగిరిగుట్ట క్షేత్రంలో గరుడ టికెట్ అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. - 8లో



**వలస కార్మికులకు విముక్తి**

నేరెడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులకు పోలీసులు విముక్తి కల్పించారు. - 8లో

**సాగర్ సమాచారం**



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

| | | |
|---|---|---|
| ప్రస్తుత నీటి మట్టం | : | 568.30 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 67,551 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 4,618 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా : నిల్ | | |
| కుడికాల్వ ద్వారా | : | నిల్ |
| ఎడమకాల్వ ద్వారా | : | 2,818 క్యూసెక్కులు |
| ఏఎమ్మార్పీకి | : | 1,800 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | నిల్ |

## న్యూస్‌రీల్

### పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ

నల్లగొండ : పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ 38 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులపై సంబంధిత అధి కారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. బాధితుల సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

### నేడు ఎన్జీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో మంగళవారం ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. కళాశాల స్థాపించి నేడు 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70 వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపనున్నారు.. ఇందుకోసం కళాశాల యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎంజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి ముఖ్య అతిథితులుగా హాజరుకానున్నారు. తెలంగాణ కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్లు డీఎస్‌ఆర్.రాజేంద్రసింగ్, పి.బాలభాస్కర్, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్, కళాశాల పూర్వ విద్యార్థి జి.యాదగిరి, పూర్వ విద్యార్థులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2021–2022 నుంచి 2023–2024 విద్యా సంవత్సరం వరకు వివిధ సబ్జెక్టుల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేయనున్నారు.

### ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత



సీడ్ బాల్స్ వేసే కార్యక్రమంలో పాల్గొన్న ప్రమోద్‌కుమార్

నల్లగొండ : ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కారాగార పర్యవేక్షణ అధికారి గౌర ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా బంజరు భూముల్లో సీడ్ బాల్స్ (విత్తన బంతులు) వేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీడ్ బాల్స్ వేయడం ద్వారా పచ్చదనం పెంపుదల, మట్టి పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఈ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలర్ సీహెచ్.బాలకృష్ణ, డిప్యూటీ జైలర్ వెంకటరెడ్డి, చింత వెంకటేశ్వర్లు, గిరిబాబు, సైదులు, నాగరాజు, రవి, శ్రావణ్, రాంబాబు పాల్గొన్నారు.

### మూసీ ప్రాజెక్టుకు జలకళ

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. మూసీ ఎగువన వర్షాలు కురుస్తుడటంతో ఆదివారం సాయంత్రం మూసీ ప్రాజెక్టుకు 880 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి ఒక్కసారిగా 2443 క్యూసెక్కులకు పెరిగింది. మూసీ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో రావటం ఈ ఏడాది ఇదే మొదటిసారి. వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు 530 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 642.50 అడుగులకు (3.73 టీఎంసీలు) చేరుకుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో మరో రెండు అడుగుల నీరు చేరితే గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశముందని పేర్కొంటున్నారు.

### 28 మండలాల్లో మోస్తరు వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా నల్లగొండ జిల్లాలో 10 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చిట్యాల మండలంలో 62.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నార్కట్‌పల్లి 35.9, కట్టంగూరు 33.1, శాలిగౌరారం 2.4, నకిరేకల్ 4.1, కేతేపల్లి 1.6, తిప్పర్తి 1.8, నల్లగొండ 6.3, కనగల్ 1.4, హాలియా 1.2, నిడమనూరు 6.6, త్రిపురారం 4.2, వేములపల్లి 7.2, మిర్యాలగూడ 7.7, దామరచర్ల 10.4, అడవిదేవులపల్లి 32.4, తిరుమలగిరి సాగర్ 3.1, పెద్దవూర 4.4, చింతపల్లి 0.4, గుర్రంపోడు 7.6, పీఏపల్లి 17.0, నేరేడుగొమ్ము 0.5, దేవరకొండ 2.3, గుండ్లపల్లి 31.5, చందంపేట 21.0, గుడిపల్లి 15.8, మునుగోడు 2.1, నాంపల్లి మండలంలో 3.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

# సబ్‌స్టేషన్ భూమి కబ్జా!

- తడకమళ్లలో రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఓ వ్యక్తి
- పట్టించుకోని రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు
- ఆ భూమి విలువ రూ.కోటిపైనే..



కబ్జా చేసిన సబ్‌స్టేషన్ భూమిలో సాగు చేసిన పశువుల మేత

మిర్యాలగూడ : సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడు. ఆ భూమిలో పశువుల కోసం గడ్డిని పెంచుతున్నాడు. సదరు భూమి ఆక్రమణ విషయంలో ఘర్షణలు సైతం చోటుచేసుకుని కేసులు కూడా నమోదయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.కోటిపైనే విలువ కలిగిన ఆ భూమిని కాపాడే విషయంలో అధికారులు మిన్నకుండి పోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ఓ నాయకుడి సహకారంతో..**

మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామ శివారులో సర్వే నంబర్ 719 లో 9.13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1990కి ముందు ఆ ప్రాంతంలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 3.20 ఎకరాలను సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం విద్యుత్ శాఖకు కేటాయించారు. గ్రామానికి చెందిన ఐదుగురికి 25 గుంటల చొప్పున లావుణి పట్టాలు ఇచ్చారు. కేటాయించిన స్థలంలోని కొంత భాగంలో సబ్‌స్టేషన్ నిర్మించారు. మిగిలిన స్థలం చుట్టూ ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి హద్దురాళ్ల పాతకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో గత సంవత్సరం ఆ భూమిపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కన్ను పడింది. అనుకున్నదే తడువుగా సదరు వ్యక్తి ఆ భూమిని కాజేసేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. నేర చరిత్ర కలిగిన ఆ వ్యక్తి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన (మాజీ సర్పంచ్) రాజకీయ నాయకుడితో కుమ్మక్కై సబ్‌స్టేషన్ భూమిని కబ్జా చేశాడు. పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాల్వను సైతం ఆక్రమించుకుని సాగు చేస్తున్నాడు. అందుకు ప్రతిఫలంగా రూ.8 లక్షలు సదరు మాజీ సర్పంచ్‌కు ముట్టజెప్పినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అక్కడ 20 గుంటల భూమిని ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు నాయకుడి చేత ఆ ఉత్తర్వులను సైతం రద్దు చేయించి ఆ భూమిని సైతం కబ్జా చేశాడు. ఇలా కబ్జా చేసిన రెండున్నర ఎకరాల చుట్టూ దర్జాగా కంచె వేసి పశువుల కోసం పచ్చి గడ్డిని పెంచుతున్నాడు.

**కబ్జా చేశాడిలా..**

సబ్‌స్టేషన్ స్థలాన్ని కాజేసేందుకు సదరు వ్యక్తి.. ఓ మండల నాయకుడితో కలిసి పక్కా స్కెచ్ వేశాడు. ముందుగా గ్రామంలో ఓ కులస్తులతో రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారిని ఆ భూమిపైకి పంపి భూమిలో చెట్లను తొలగించడం, మడులుగా చేయడం వంటి పనులు చేయించాడు. విషయాన్ని తెలుసుకున్న గ్రామానికి చెందిన మరికొందరు ఆ భూమి తమదేనని వారితో గొడవలకు దిగారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలు కేసులు పెట్టుకున్నాయి. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైనట్లు తెలిసింది. దీంతో ఆ వ్యక్తి ఇరువర్గాలకు కొంత మొత్తం ముట్టజెప్పి ఆ భూమిని కబ్జా చేశాడు. ఇలా గ్రామంలో గొడవలు సృష్టించి సబ్‌స్టేషన్ స్థలాన్ని చాకచక్యంగా కబ్జా చేశాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**హద్దులు పరిశీలించి ఫిర్యాదు చేస్తాం**

తడకమళ్ల సబ్‌స్టేషన్ భూమి కబ్జాకు గురైన విషయం నా దృష్టికి వచ్చింది. సబ్‌స్టేషన్‌కు సంబధించిన భూమి హద్దులు పరిశీలించి కబ్జాపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. అనంతరం చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసాచారి, ట్రాన్స్‌కో డీఈ, మిర్యాలగూడ

**భూ కబ్జాపై విచారణ చేస్తాం**

మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామ శివారులో గల 719 సర్వే నంబర్‌లో సబ్ స్టేషన్‌కు కేటాయించిన భూమిలో 2.5 ఎకరాలు కబ్జాకు గురైనట్లు మాకు సమాచారం లేదు. ట్రాన్స్‌కో అధికారులు ఫిర్యాదు చేస్తే భూ కబ్జా విషయంపై సమగ్ర విచారణ జరిపి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సురేష్‌కుమార్, తహసీల్దార్, మిర్యాలగూడ

# రెండు విడతలుగా 'స్థానిక' పోరు

- ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- ఆ తరువాతే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు
- ఈ నెలాఖరుకు లేదంటే ఆగస్టు మొదటివారంలో షెడ్యూల్
- ఎన్నికల నిర్వహణకు అన్నీ సిద్ధం చేస్తున్న యంత్రాంగం





సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ముందుగా నిర్వహించే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ఇప్పటికే అనధికారికంగా జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో అధికారులు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు.

**జిల్లాలో 33 మండలాలు..**

జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉన్నాయి. మండలాల పరిధిలో 33 జెడ్పీటీసీలను, 353 ఎంపీటీసీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఇందుకు మొత్తం 1,925 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి మొత్తం 11,550 మంది సిబ్బంది అవసరం ఉండగా, 9,588 మంది సిద్ధంగా ఉన్నారు. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నందున సిబ్బంది సమస్య తొలగిపోనుంది.

**గతంలోనే సంసిద్ధం..**

ఈ ఏడాది ఫిబ్రవరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారన్న చర్చ జరిగింది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకొని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి కూడా ఆదేశాలు వచ్చాయి. దాంతో అప్పట్లోనే జిల్లా యంత్రాంగం ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసింది. మండలాల వారీగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. బ్యాలెట్ పేపర్లను కూడా తీసుకొచ్చి ఎస్పీ కార్యాలయంలో భద్ర పరిచింది. బ్యాలెట్ బాక్సులను కూడా సిద్ధం చేసి ఉంచింది. ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. పోలింగ్ సిబ్బంది శిక్షణ మాత్రం ఆగిపోయింది. ఇప్పుడు తాజాగా ఆ శిక్షణ చేపట్టడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

**అన్నీ సరి చూసుకోవాలని ఆదేశాలు..**

ఎన్నికల షెడ్యూల్ ఈ నెల చివరలో లేదంటే ఆగస్టు మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర స్థాయి అధికారులు.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. దీంతో స్టేషనరీ, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులతో పాటు సిబ్బంది నియామకాల విషయంలో అధికారులు తన మునకలయ్యారు. గతంలో చేసిన ఏర్పాట్లను సమీక్షించుకొని మిగతా అవసరాలపైనా దృష్టి పెట్టారు. ఎక్కడెక్కడ ఏమేం తక్కువగా ఉన్నాయి.. ఏ మేరకు అవసరం ఉన్నయో గుర్తించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసే పనిలో పడ్డారు. మొత్తానికి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తే పోలింగ్ సిబ్బంది, ఆర్వోల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని తెలిపారు.

# విపత్తు నిర్వహణ సంస్థలను అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విపత్తు నిర్వహణ సంస్థలను రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల సరఫరాపై అధికారులకు పలు సూచనలు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల ద్వారా సక్రమ నీటి నిర్వహణ, రేషన్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



దేవరకొండలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

హాలియా : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఏఐసీసీ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా చేయాలని కోరారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి ప్రజలకు అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి, పున్న కైలాష్, పసుపులేటి సైదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, కర్నాటి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, ఆంగోతు భగవాన్‌నాయక్, వెంపటి శ్రీనివాస్, గౌనీ రాజారమేష్‌యాదవ్, కుకుడాల ఆంజనేయులు, చంద్రశేఖర్, పగడాల నాగరాజు, బానుచందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**పార్టీని బలోపేతం చేయాలి**

దేవరకొండ : కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఇందుకుగాను గ్రామ స్థాయి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఎంపిక చేసే అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రతిఒక్క కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మార్కెట్ చైర్మన్లు నాయిని మాధవ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, నాసిర్ అహ్మద్, ఎంఏ సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్య, రుక్మారెడ్డి, దేవేందర్ నాయక్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్ పాల్గొన్నారు.

### మహా శివుడికి బిల్వార్చన

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటికలింగానికి పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# ఆయకట్టులో అదునుదాటుతోంది!

- సాగునీటి కోసం సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు రైతుల ఎదురుచూపు
- మేజర్లకు నీటి విడుదలపై స్పష్టత కరువు



సాగర్ ఎడమకాల్వ నుంచి పాలేరుకు వెళ్తున్న నీరు

మిర్యాలగూడ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా ఉంది సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు రైతులు పరిస్థితి. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ సీజన్‌లో ముందస్తుగానే కృష్ణానదికి వరద వచ్చింది. ఎగువన ప్రాజెక్టులన్నీ నిండి.. సాగర్‌కు వరద వస్తుండడంతో ముందస్తుగానే సాగునీరు విడుదలవుతుందని ఆశించిన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆయకట్టులో కొందరు రైతులు నార్లు పోసుకుని నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. బోర్లు, బావులు లేని రైతులు నీరు విడుదల చేశాక నారు పోసుకుని.. నాట్లు వేసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. కానీ సాగునీటి విడుదలపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అదును దాటిపోతోందని ఆవేదన చెందుతున్నారు.

**పాలేరుకు వెళ్తున్న జలాలు**

నల్లగొండ జిల్లాలో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లా అవసరాలకు కాకుండా ఖమ్మం జిల్లా అవసరాలను తీరుస్తున్నారు. నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావం కారణంగా చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటాయి. కానీ ఇక్కడ చెరువులను వదిలేసి ఖమ్మం జిల్లాలో పాలేరు రిజర్వాయర్‌లో నీటిని నింపారు. రెండు రోజుల నుంచి మళ్లీ పాలేరుకు రోజూ 3 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కానీ ఇక్కడి మేజర్లకు ఎప్పుడు నీటిని విడుదల చేస్తారో చెప్పడం లేదు.

**సాగునీటి కోసం ఎదురుచూపు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని రైతులకు ఎడమకాల్వ నీరే ఆధారం. బావులు, బోర్లు ఉన్నా.. కాల్వలో నీరు పారితేనే భూగర్భ జలాలు పెరిగి పంటలు పండుతాయి. కానీ ఆయకట్టులో ఈసారి వర్షాలు కూడా సరిగా లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో రైతులంతా కాల్వలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. సాగర్‌కు వరద వస్తున్న ఈ తరుణంలో మేజర్ల ద్వారా నీటి విడుదల చేయాల్సి ఉన్నా.. తూములన్నీ బంద్‌చేసి నేరుగా ఖమ్మం జిల్లాకే నీరు తరలించుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ ప్రకటించి మేజర్లకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.


**సాగు, తాగు అవసరాలకు పాలేరుకు విడుదల చేస్తున్నాం : ఎన్‌ఎస్పీ ఈఈ**

నీటి విడుదల విషయమై ఎన్‌ఎస్పీ ఈఈ వెంకటయ్యను వివరణ కోరగా.. ప్రభుత్వ ఆదేశానుసారం సాగు, తాగునీటి అవసరాల కోసం ఖమ్మం జిల్లాలోని పాలేరుకు నీటిని తరలిస్తున్నామని తెలిపారు. రోజుకు మూడు వేల క్యూసెక్కుల నీటిని సాగర్ జలాశయం నుంచి విడుదల చేస్తున్నామని.. ప్రాజెక్టుకు వరద నీరు వచ్చినా కొద్ది పాలేరుకు నీటి విడుదల పెంచుతామని పేర్కొన్నారు. ఎడమకాల్వకు సాగునీటి విషయంపై ప్రశ్నించగా ఆయకట్టు రైతులు కూడా వినియోగించుకోవచ్చని చెప్పారు. మేజర్లు, మైనర్లు షట్టర్లు బంద్ చేశారు కదా అని అడగగా అది వాస్తవమేనని సమాధానం దాటవేశారు.


# భారీ చోరీ కలకలం

## సూర్యాపేటలో జ్యువెలరీ షాపును కొల్లగొట్టిన దుండగులు

- రూ.కోట్లు విలువ చేసే బంగారం అపహరణ
- విషయం తెలియడంతో ఉలిక్కిపడ్డ వ్యాపారులు
- ఉమ్మడి జిల్లాలో ఇంత పెద్ద దొంగతనం ఇదే..
- చర్చనీయాంశంగా చోరీ ఘటన



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ



లాకర్ రూమ్ షట్టర్‌ను కట్ చేసిన దుండగులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జ్యువెలరీ షాపులో ఆదివారం రాత్రి జరిగిన భారీ దోపిడీ కలకలం రేపింది. దొంగలు జ్యువెలరీ షాపునకు కన్నం వేసి 8కిలోల బంగారం చోరీచేయడంతో బంగారం షాపు నిర్వాహకులతో పాటు పట్టణంలో ఇతర వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. సూర్యాపేట పట్టణంలో ప్రధాన రోడ్డు అయిన ఎంజీ రోడ్డులోని శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో దొంగతనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. గతంలో ఎప్పుడూ కూడా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇంత పెద్ద దొంగతనం జరగలేదు. 2011లో సూర్యాపేటలోని పూల సెంటర్ రోడ్డులో ఓ బంగారం షాపులో కిలో బంగారాన్ని అప్పట్లో దొంగలు ఎత్తుకుపోయారు. అప్పటి నుంచి అంత పెద్ద మొత్తంలో దొంగతనాలు జరగలేదు. తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏకంగా ఎనిమిది కిలోల బంగారం చోరీకి గురికావడం కలకలం సృష్టించింది. భారీ దొంగతనం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. జిల్లా కేంద్రంలో చాలా చోట్ల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదు. రాత్రి వేళల్లో సైతం పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**కొత్త షాపు పెట్టేందుకు ఎక్కువ మొత్తంలో కొనుగోలు**

సూర్యాపేటకు చెందిన తెల్ల కిషోర్ పదమూడు సంవత్సరాలుగా బంగారం వ్యాపారం చేస్తున్నాడు. మొదటగా జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో బంగారం షాపు నిర్వహిస్తుండగా ఆ తర్వాత ఐదేళ్ల క్రితం షాపును ఎంజీ రోడ్డుకు మార్చాడు. ఎక్కువగా ముంబై, హైదరాబాద్ నుంచి బంగారం కొనుగోలు చేస్తుంటారు. అయితే, ఇటీవల మరో బంగారం షాపు పెట్టేందుకు భారీగా బంగారం కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బంగారాన్ని షాపులోని లాకర్ రూంలో గల అల్మారాలో భద్రపరిచాడు. ప్రస్తుతం శ్రీసాయి జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్న మడిగె అద్దెకు తీసుకున్నది. తాను సొంతంగా కొత్తగా భవనాన్ని నిర్మించాడు. వచ్చే నెలలో ఈ షాపును తన సొంత భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. కొత్త షాపులో పెట్టేందుకు సుమారు 16కిలోలకు పైగా బంగారం కొనుగోలు చేసినట్టు వ్యాపారి కిషోర్ చెబుతున్నాడు.

**కొనుగోలు చేసిన రెండు వారాలకే చోరీ..**

షాపు నిర్వాహకుడు కిషోర్ అధిక మొత్తంలో బంగారం కొనుగోలు చేసి తీసుకువచ్చి షాపులో పెట్టిన రెండు వారాలకే దొంగతనం జరగడం గమనార్హం. ఇది తెలిసిన వారి పనేనా అనే అనుమానం కలుగుతోంది.

**పది రోజుల క్రితమే లాకర్ మార్పు..**

ఇంతకాలం నడిపించిన షాపులో ఉన్న లాకర్‌ను పది రోజుల క్రితమే తన సొంత భవనంలో మార్చాడు. అయితే ఆ షాపు ఇంకా ఓపెన్ కాకపోవడంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసిన బంగారాన్ని షాపులోని లాకర్ గదిలో అల్మారాలను ఏర్పాటు చేసుకొని ఆ గదికి షెట్టర్ చేయించాడు. మరో పది రోజుల్లో షాపు మార్చాక బంగారం తీసుకెళ్లొచ్చనే భావనతో యజమాని ఉన్నాడు. ఇంతలోనే చోరీ జరగడంతో లబోదిబోమంటున్నాడు. బంగారం 16కిలోలకు పైగా ఉండగా అందులో ఎనిమిది కిలోల బంగారం, రూ.18లక్షల నగదును మాత్రమే ఎత్తుకెళ్లారు. వెండిని ముట్టుకోలేదు. అలాగే షాపులో నుంచి లాకర్ గదికి వచ్చే డోర్‌ను వెనుకాల నుంచి గడియ పెట్టి పరారయ్యారు.

**కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు**

చాలా కాలంగా బంగారం షాపు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి సంఘటన ఎప్పుడు జరగలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒక్కసారిగా పెద్ద మొత్తంలో బంగారం దొంగలు ఎత్తుకెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కొత్త షాపులోకి మంచి డిజైన్‌లతో కూడిన ఆభరణాలు, బంగారు బిస్కెట్‌లు తీసుకొస్తే వాటిని దొంగలు ఎత్తుకుపోవడంతో తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. దొంగతనం సమాచారం తెలిసిన ప్రజలు షాపు వద్దకు గుంపులు గుంపులుగా వచ్చారు. విలపిస్తున్న షాపు యజమానితో పాటు కుటుంబ సభ్యులను పలువురు ఓదార్చారు.

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రవీందర్ (ఫైల్)

మద్దిరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం కుక్కడం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజగానితండాకు చెందిన లాకవత్ రవీందర్ బతుకుదెరువు కొరకు హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని అన్నోజిగూడలో బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోనే ఓ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి కృష్ణారెడ్డి, పాపయ్య, శ్రీనివాస్, ధనుంజయ్య, సతీష్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వారి నుంచి రూ. 8,440 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ సైదులు తెలిపారు.

# గరుడ టికెట్‌తో శీఘ్ర దర్శనం

- తిరుమల శ్రీవాణి ట్రస్టు తరహాలో యాదగిరిగుట్టలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు
- ఒక్కో టికెట్ ధర రూ.5వేలు


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేలా ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళ రూ.300 టికెట్‌తో బ్రేక్ దర్శనం పేరిట ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారు. ఇదే మాదిరిగా ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని అంతరాలయంలో దర్శించుకునే విధంగా గరుడ టికెట్‌ను త్వరలోనే ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**తిరుమల శ్రీవాణి ట్రస్టు తరహాలో..**

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రస్తుతం భక్తులకు శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10,500 టికెట్‌ను అందిస్తున్నారు. ఇదే తరహాలో యాదగిరిగుట్టలో సైతం ఒక్కో భక్తుడికి రూ.5,000తో గరుడ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే ప్రముఖులు, ఎన్‌ఆర్‌ఐలు, విదేశీయులతో పాటు సామాన్య భక్తులు సైతం క్యూలైన్లలో గంటల తరబడి నిల్చునేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ గరుడ టికెట్‌ను ప్రవేశపెడితే తొందరగా, సులవుగా దర్శనం కావడంతో పాటు దేవాలయానికి ఆదాయం సైతం పెరగనుంది. ఈ టికెట్ కొనుగోలు చేసే భక్తులకు 5 అభిషేకం లడ్డూలు, కిలో పులిహోర ప్రసాదాన్ని సైతం అందజేయనున్నారు. అంతేకాకుండా ఆశీర్వచనం సైతం చేయనున్నారు. గరుడ టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఉదయం ఆలయం తెరిచినప్పటి నుంచి రాత్రి వరకు ఎప్పుడైనా అంతరాలయంలో స్వామివారిని దర్శించుకోవచ్చు.

**వ్రత టికెట్ల ధర పెంపు..**

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రతం జరిపించేందుకుగాను ప్రస్తుతం టికెట్ ధర రూ.800 ఉండగా.. దానిని రూ.1,000కి పెంచుతూ ఆలయ ఈఓ వెంకట్రావ్ ఇటీవల నిర్ణయించారు. ఈ రూ.1000 టికెట్ కొనుగోలు చేస్తే.. ప్రస్తుతం సత్యనారాయణ వ్రతం జరిపించడానికి ఆలయం తరఫున భక్తులకు అందజేస్తున్న వ్రత సామగ్రితో పాటు స్వామివారి ప్రతిమ, శెల్లా, కనుమను అదనంగా ఇవ్వనున్నారు. ప్రతి రోజు వ్రత మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు బ్యాచ్‌ల్లో 350 నుంచి 450 వ్రతాలు జరుగుతాయి. ఆదివారాలు, సెలవు రోజుల్లో మరో 100 వ్రతాలు అదనం. ప్రస్తుతం రూ.800 టిక్కెట్‌తో రోజుకు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. రూ.1000కి ధర పెంచడంతో అదనంగా మరో రూ.90వేలు రోజుకు ఆదాయం అదనంగా రానుంది.

# ఉచితాలతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- పనిచేసే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదు
- అధికార, ప్రతిపక్షాలు వాడే భాష మార్చుకోవాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ: ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాల వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేసే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదన్నారు. ప్రజలు ఉచితాల పథకాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దేశంలో వ్యవసాయమే ప్రధానమైందని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పని వైపు ప్రజలను మళ్లించి ఉచితాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చే అవినీతికి మూలం**

దేశంలో అవినీతి పేరుకుపోయిందనే వాదన ఉంది. ఎన్నికల్లో విచ్చలవిడిగా పార్టీలు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నాయి. ఆ తర్వాత ఖర్చుపెట్టిన డబ్బును సంపాదించడానికి అవినీతికి పాల్పడుతున్నారు. దీనిని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్ చొరవచూపాలి. రాజకీయ నాయకులే కాదు.. కొందరు అధికారులు కూడా అవినీతికి పాల్పడుతున్నారు. ఇంజనీరింగ్ శాఖలో ఇష్టమొచ్చినట్లు ఎస్టిమేట్ వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు.

**నాయకుల భాష మారాలి**

రాజకీయ నాయకులు మాట్లాడే భాష మార్చుకోవాల్సిన అవసరం ఉంది. వారు వాడే భాషతో భవిష్యత్ తరాలకు ఏం మెసేజ్ ఇస్తున్నారనేది ఆలోచించాలి. రాజకీయ నాయకులంటే ఇప్పటికే ప్రజలు ఈసడించుకుంటున్నారు. రాజకీయ నాయకులు గౌరవంగా మాట్లాడాలి. బనకచర్లను ముఖ్యమంత్రి వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఒప్పందం ప్రకారమే చేసుకోవాలి. ఎమ్మెల్సీలు మల్లన్న, కవిత ఫిర్యాదులపై రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తారన్నారు. పెద్దల సభను గౌరవించాల్సిన అవసరం అందరికి ఉంది. దూషణలు, దాడులు సరికావన్నారు. సాగర్ ఎడమ కాల్వకు ముందే నీటి విడుదల చేయడం వల్ల రైతులు ఆనందంగా ఉన్నారన్నారు.

# ఒకే ప్రదేశంలో రెండు రోడ్డు ప్రమాదాలు

- లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- అదే ప్రదేశంలో మరో ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన డీసీఎం
- ఓ ప్రయాణికుడు మృతి
- బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ రోడ్డు వద్ద ఘటన

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ వద్ద సోమవారం ఒకే ప్రదేశంలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనలో ఓ ప్రయాణికుడు మృతిచెందగా.. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న స్టార్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సోమారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలోని నల్లగొండ బైపాస్ రోడ్డు వద్ద హోటల్ ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన కొద్దిసేపటికి గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న అదే స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు డ్రైవర్ రోడ్డు పక్కన బస్సు ఆపి.. తమ కంపెనీ చెందిన బస్సు ప్రమాదానికి గురికావడంతో వివరాలు తెలుసుకునేందుకు రోడ్డు అవతలి వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన గుడిబండి వెంకట్‌రెడ్డి(84) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 10మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

# వలస కార్మికులకు శ్రమ దోపిడీ నుంచి విముక్తి

- సాగర్ బ్యాక్ వాటర్ అటవీ ప్రాంతంలోని స్థావరంలో బందీలుగా ఇతర రాష్ట్రాల కార్మికులు
- వారి చేత చేపలు పట్టే పనులు చేయిస్తూ.. వేతనాలు ఇవ్వని వైనం
- సొంతూరికి వెళ్లలేక.. వేతనాలు లేక చితికిపోయిన కార్మికులు
- పోలీసుల తనిఖీతో బయటపడ్డ కార్మికులు


వలస కార్మికుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

చందంపేట: వారంతా అమాయక కూలీలు.. కూలీనాలి చేసుకుంటూ రోజు గడిపే వారు. వారికి పనులు కల్పిస్తామంటూ కొందరు మాయమాటలతో నమ్మించి.. వారి శ్రమను వాడుకుంటూ.. వేతనాలు ఇవ్వడం లేదు. తిరిగి సొంతూరికి కూడా వెళ్లనివ్వకుండా దాడులు చేస్తూ.. కనీసం వారి కుటుంబీకులతో ఫోన్‌లో కూడా మాట్లాడనివ్వలేదు. గత రెండేళ్లుగా సాగుతున్న ఈ శ్రమదోపిడీ దందా గుట్టును రట్టు చేశారు పోలీసులు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో స్పెషల్ కార్డన్ సెర్చ్ చేపట్టగా శ్రమ దోపిడీతో రెండేళ్లుగా నరకం అనుభవిస్తున్న వలస కార్మికులకు విముక్తి లభించింది. అయితే కొందరికి మాత్రమే విముక్తి లభించగా.. మరికొందరి కోసం పోలీసుల విచారణ కొనసాగుతోంది.

**రెండేళ్లుగా గుట్టుగా..**

నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీలో చేపల వేట నిర్వహిస్తున్న పలువురు మత్స్యకారులు ఈ ప్రాంతంలో పనులు చేసేందుకు గాను ఒడిషా, మహారాష్ట్ర, బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చారు. ఇలా తీసుకొచ్చిన వారిని సాగర్ బ్యాక్ వాటర్ సమీపంలోని ఓ అటవీ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసి వారితో పనులు చేయించుకుంటున్నారు. చేపలు పట్టేందుకు వీరితో పనులు చేయించుకుంటూ వారికి వేతనం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. కేవలం అన్నం మాత్రమే పెట్టి వెట్టి చేయించుకున్నారు. రెండేళ్లుగా ఇలా వారు నరక యాతన అనుభవిస్తున్నారు.

**తిరిగి వెళ్లనివ్వకుండా..**

వైజాగ్‌కాలనీలో పనిచేసే వలస కార్మికులు తిరిగి వారి సొంత ప్రాంతానికి వెళ్లే మార్గం చూపించకుండా.. సాగర్ వెనుక జలాల్లో అటవీ ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేసి వారిని అక్కడే ఉంచి వెట్టి చాకిరి చేయిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులతో కూడా ఫోన్‌లో మాట్లాడనివ్వకుండా బలవంతంగా పనులు చేయించి హింసించారు. డబ్బులు అడిగితే వారిపై దాడులకు పాల్పడ్డారు.

**పోలీసుల దాడులతో బట్టబయలు**

వలస కార్మికుల వెట్టి చాకిరీ విషయం దేవరకొండ పోలీసుల దృష్టికి రావడంతో ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో ఆది, సోమవారం ఆ ప్రాంతాలను గుర్తించి, 30 మంది వలస కార్మికులను దేవరకొండకు తరలించారు. వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా వంద మంది వరకు కూలీలు వచ్చినట్లు సమాచారం ఉండడం.. కొంత మంది మాత్రమే దొరకడంతో మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

**ఓ కార్మికుడి అంత్యక్రియలూ ఇక్కడే..**

నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన కార్మికుడు తన స్వగ్రామానికి వెళ్తానని తనను ఇక్కడికి తీసుకొచ్చిన వారిని అడిగాడు. వారికి తెలియకుండా తన స్వగ్రామానికి వెళ్లే ప్రయత్నంలో పెద్దమునిగల్ గ్రామ అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. అతని మృతదేహాన్ని కనీసం స్వగ్రామానికి కూడా పంపకుండా.. వైజాగ్ కాలనీలోనే అంత్యక్రియలు నిర్వహించారు.



## యువకుడి అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: స్నేహితుడి తీసుకురావడానికి బైక్‌పై బస్టాండ్‌కు బయల్దేరిన యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కుర్ర సందీప్‌కు ఈ నెల 19వ తేదీ రాత్రి 9గంటల సమయంలో తన స్నేహితుడైన షేక్ సమీర్ ఫోన్ చేశాడు. హైదరాబాద్ నుంచి తాను, తన తండ్రి జాన్ మహ్మద్ గోరె వస్తున్నామని.. ఎవరిదైనా బైక్ తీసుకుని మిర్యాలగూడ బస్టాండ్‌కు రమ్మని సందీప్‌కు చెప్పాడు. దీంతో సందీప్ తన ఇంటి పక్కనే ఉంటున్న గొని మధు బైక్ తీసుకుని మిర్యాలగూడ బస్టాండ్‌కు బయల్దేరాడు. కానీ అతడు బస్టాండ్‌కు వెళ్లకుండా కనిపించకుండాపోయాడు. ఎంత వెతికినా సందీప్ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అతడి తల్లి ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## యాదగిరిగుట్ట దర్శనానికి వచ్చి..

- మహిళ అదృశ్యం

భువనగిరి: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన మహిళ భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జీడిమెట్ల ప్రాంతంలోని గాజులరామారానికి చెందిన గంధం త్రివేణి ఈ నెల 17న తన స్నేహితురాలు రమ్యతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్తున్నట్లు ఇంట్లో భర్తతో చెప్పి బయల్దేరింది. కొంత సమయం తర్వాత భర్త శ్రీహరి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని త్రివేణిని అడగడంతో భువనగిరి మండలం వడాయిగూడెం వద్ద ఓ లాడ్జీలో ఉన్నట్లు చెప్పింది. సాయంత్రం వరకు ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం త్రివేణి తల్లి నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మహిళా వయస్సు 30 సంవత్సరాలు, 5 అడుగుల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 87126 62472, 87126 62733 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## కొండగడప విద్యార్థినికి ప్రశంసలు


సన్మానం పొందుతున్న స్వాతి

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీలోని కొండగడప గ్రామానికి చెందిన ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని దొండ స్వాతి ప్రముఖ సాహితీవేత్తల నుంచి ప్రశంసలు అందుకుంది. స్వాతి చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే రచనలు, వ్యాసాలు రాస్తూ పేరుగడించారు. ఆమె రాసిన వ్యాసం చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ సూర్య ధనుంజయ్, ప్రసిద్ధ సాహితీవేత్త ముదిగొండ శివప్రసాద్, నలిమెల భాస్కర్, అట్టెం దత్తయ్య వ్యాసాల సరసన చోటు దక్కడంతో ఆమెకు సత్కరించారు.ఆదివారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ పటేల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు స్వాతిని శాలువాతో సన్మానించి అభినందించారు.

# ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

సంస్థాన్ నారాయణపురం: ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ అటవీ ప్రాంతంలోని కడిలబావితండాలో సోమవారం జరిగింది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పీపుల్ పహాడ్ గ్రామానికి చెందిన దండుగుల రంజిత్ (32) కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కంప్రెషర్ పని నిమిత్తం ట్రాక్టర్‌ను తీసుకొని సోమవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి వెళ్తుండగా.. రాచకొండ ప్రాంతంలో కడీలబావితండా పరిధిలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న గుంతలో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో రంజిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**బోరు బండి పైనుంచి పడి..**


కుర్ర సందీప్

రామగిరి(నల్లగొండ): బోరు బండి పైనుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగిరి విలాస్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అనిల్ కకాడియా బోర్ బండి మీద కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగిరి విలాస్‌లో బోర్ వేసిన అనంతరం ఒంటిపై ఉన్న దుమ్మును శుభ్రం చేసుకునే క్రమంలో విశాల్ వర్కాడే అనే వ్యక్తి ఎయిర్ పైపును అనిల్ కకాడియా వెనుక నుంచి పెట్టగా అతడు ప్రమాదవశాత్తు బోర్ బండి పైనుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అనిల్ కకాడియాను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్ను వార్కడే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

# తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికులకు గాయాలు

వలిగొండ: వేర్వేరు చోట్ల తాటిచెట్టు పైనుంచి పడి ఇద్దరు గీత కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు క్లాం నరసయ్య(50) సోమవారం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. కాలు జారి కిందపడడంతో కాలు విరిగింది. గ్రామస్తులు గమనించి అతడిని వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ఎక్స్‌గ్రేషియా అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు కోరారు. ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు, ప్రమాద బీమా అందజేయాలని అన్నారు.

**మోకు జారి కిందపడి..**

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు దేశగాని నరేష్ సోమవారం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేష్‌ను కల్లుగీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు పరామర్శించి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బీసీ కార్పొరేషన్ నుంచి రూ.15వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



## నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశి సందర్భంగా సోమవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, అర్చకులు వేదమంత్రాలతో శ్రీస్వామివారిని కొలుస్తూ తులసీ దళాలతో లక్ష పుష్పార్చన చేశారు. అంతకుముందు వేకువజామున సుప్రభాత సేవ, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, సహస్రనామార్చనలు చేశారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం, వెండి జోడుసేవ ఊరేగింపు వేడుకలతో ఆలయం సందడిగా మారింది.



## పాముకాటుతో గొర్రెల కాపరి మృతి


నడిగూడెం: పాముకాటుకు గురై గొర్రెల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ జి. అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా ఇడ్లీరు గ్రామానికి చెందిన సిద్ధ నగేష్ (28) గొర్రెలను మేపుకుంటూ నడిగూడెం మండలానికి వలస వచ్చాడు. గత రెండు రోజులుగా నడిగూడెం మండలం రత్నవరం గ్రామ సమీపంలో శ్రీరంగాపురం గ్రామానికి చెందిన శేషగుప్తా వ్యవసాయ క్షేత్రంలో పెంట కోసం గొర్రెలను ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున గొర్రెల వద్ద నిద్రిస్తున్న నగేష్‌ను పాము కాటు వేసింది. అతడిని కోదాడకు తరలించగా.. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చింతపల్లి: భూ వివాదంలో అవతలి వ్యక్తులు అనే మాటలకు మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చింతపల్లి మండలం వింజమూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బద్దవారిగూడెంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి వివరాల ప్రకారం.. బద్దవారిగూడేనికి చెందిన కడారి చంద్రయ్య(55) చంద్రయ్య కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి మధ్య పొలం పంచాయితీ జరుగుతుండగా.. ఆ వ్యక్తి అనే మాటలకు మనస్తాపం చెందిన చంద్రయ్య సోమవారం తన వ్యవసాయ పొలం వద్ద వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# రూ.20కే రూ. 2లక్షల బీమా

- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో భవిష్యత్తుకు భరోసానిస్తున్న కేంద్ర ప్రభుత్వం


భువనగిరిలో పీఎంఎస్‌బీవై పోస్టర్ ఆవిష్కరిస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం లక్ష్మిశ్రావ్య తదితరులు

భువనగిరిటౌన్: కేంద్ర ప్రభుత్వం దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారికి బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై)ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సంవత్సరానికి రూ.20 కట్టడం ద్వారా రూ.2లక్షల బీమా పొందవచ్చు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు గల భారతీయ పౌరులు ఈ బీమాకు అర్హులు. అయితే ఇందు కోసం ఏదైనా బ్యాంకులో పొదుపు ఖాతా ఉండాలి. ఒకవేళ ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు ఉంటే.. ఏదైనా ఒక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖాతా ఉంటే.. ఆ ఖాతాలో పేర్లు ఉన్నవారందరూ ఈ పథకంలో చేరడానికి అర్హులు అవుతారు. ఎన్‌ఆర్‌ఐలు కూడా ఈ పథకంలో చేరేందుకు అర్హులు. కానీ క్లెయిమ్ మాత్రం లబ్ధిదారుడికి లేదా నామినీకి భారత కరెన్సీలో చెల్లిస్తారు.

**ప్రీమియం ఎంత చెల్లించాలి అంటే..**

పీఎంఎస్‌బీవై పథకంలో వార్షిక ప్రీమియంగా కేవలం రూ.20 చెల్లిస్తే సరిపోతుంది. ప్రతి సంవత్సరం జూన్ 1వ తేదీ తర్వాత ఆటోమెటిక్‌గా బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియంను కట్ చేస్తారు. దీని కాలపరిమితి ఒక సంవత్సరం. ఏటా దీనిని పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఒకటి లేదా అంత కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పథకంలో చేరినట్లయితే.. క్లెయిమ్ సమయంలో కేవలం ఒక బ్యాంకు అకౌంట్‌కు మాత్రమే బీమా చెల్లిస్తారు. అంటే ఇతర బ్యాంకు అకౌంట్ల ద్వారా చెల్లించిన ప్రీమియాన్ని కోల్పోవాయినట్లే అవుతుంది. బీమా క్లెయిమ్ చేస్తే ప్రీమియం మారుతూ ఉంటుంది. ఎలాంటి క్లెయిమ్ చేయకపోతే మొదటి మూడేళ్లలో ప్రీమియంలో ఎలాంటి మార్పులు ఉండవు. బ్యాంకులు ఈ పాలసీకి సంబంధించిన ఎలాంటి పాలసీ సర్టిఫికెట్లు జారీ చేయవు.

**బీమా వర్తించే సందర్భాలు..**

సహజ విపత్తుల వల్ల జరిగిన ప్రమాదాల వల్ల మరణం లేదా వైకల్యం సంభవించినప్పుడు మాత్రమే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం వర్తిస్తుంది. ఆత్మహత్య చేసుకున్న సందర్భాల్లో ఈ పథకం వర్తించదు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబానికి కూడా ఎలాంటి బీమా ప్రయోజనం లభించదు. ఒకవేళ చందాదారుడు హత్యకు గురైతే మాత్రం బీమా కవరేజ్ లభిస్తుంది. ప్రమాదవశాత్తు చందాదారుడు మరణిస్తే, మరణాన్ని ధ్రువీకరించడానికి సరైన పత్రాలను సాక్ష్యంగా చూపించాలి. అప్పుడు మాత్రమే పీఎంఎస్‌బీవై పథకం కింద క్లెయిమ్ మంజూరు అవుతుంది. ఒకవేళ రోడ్డు, రైలు, ఏదైనా వాహన ప్రమాదం, నీటిలో మునిగిపోవడం, హత్యకు గురికావడం లాంటి మరణాలు సంభవిస్తే.. వాటిని పోలీసుల ధ్రువీకరించాలి. అలాగే పాము కాటు, చెట్టుపై నుంచి కిందపడి చనిపోతే.. ఆ మరణాలను వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. అప్పుడే మాత్రమే ఈ పథకం ద్వారా క్లెయిమ్ లభిస్తుంది. చందాదారుడు మరణించిన సందర్భంలో అభ్యర్థన నమోదు పత్రం ప్రకారం నామినీ క్లెయిమ్ కోసం దాఖలు చేయవచ్చు. ఒకవేళ నామినీ పేరును అభ్యర్థన నమోదు పత్రంలో తెలుపకపోతే అప్పుడు చందాదారుని చట్టపరమైన వారసుడు క్లెయిమ్ కోసం దాఖలు చేసుకోవచ్చు. మరణించిన వారి తరఫు క్లెయిమ్‌లు నామినీ, చట్టపరమైన వారసుల బ్యాంకు ఖాతాలో జమవుతాయి. అదే వైకల్యం తాలూకా క్లెయిమ్‌లు మాత్రం చందాదారుడి బ్యాంకు ఖాతాలో జమవుతాయి.

**లబ్ధి పొందేది ఇలా..**

ఈ బీమా పథకంలో చేరిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనా బాధిత కుటుంబానికి లేదా నామినీకి రూ.2,00,000 అందిస్తారు. ఒక వేళ పాలసీదారుడు పాక్షిక వైకల్యానికి గురైతే రూ.లక్ష పరిహారం అందిస్తారు. ప్రమాదంలో రెండు కళ్లు పూర్తిగా కోల్పోయినా లేదా రెండు చేతులు లేదా కాళ్లు కోల్పోయినా.. దానిని శాశ్వత వైకల్యంగా గుర్తించి రూ.2 లక్షలు పరిహారంగా అందిస్తారు. ఒక కాలు లేదా ఒక చెయ్యి, ఒక కంటి చూపు కోల్పోతే మాత్రం దానిని పాక్షిక వైకల్యంగా గుర్తించి రూ.లక్ష రూపాయలు పరిహారంగా ఇస్తారు.